# మా ప్రణయ సంసారం

జీవన్ప్రభాత్

> ఇది అనుసరణీయం,
> ఆదర్శవంతం
> అవగలిగితే...?
>
> - - - - - - - - - - - -
>
> 'ఆఇంట్లో జీవితమంటే నాకు రోత జనించింది. పాపం, బావ తలవంచుకుని ఒక్కమాటేనా ఆడేవాడుగాదు. అతని జీవితాన్ని పాడుచేసిన దాన్ని నేనేమోనని ఒక్కొక్కప్పుడు భయపడేదాన్ని. అతని జీవితం సుఖవంతం చెయ్యాలని నిశ్చయించుకున్నాను.
>
> - - - - రాధ.'

నా పుట్టినింటినుంచి నేనూ బావా జెట్టాపట్టాలు వేసుకుని వెళ్ళిపోయేమంటే కారణం లేకపోలేదు. అన్నివిధాలా బిడ్డ సౌఖ్యం కోసం పాటుపడేది తల్లే అయినప్పటికీ, ఒక్కొక్క సమయంలో తన బిడ్డని అధోగతిపాలుచేసేదికూడా తల్లే......

మా సంసారకథకు ముందు మా ప్రణయకథ—చాలా వింతగా వుంటుంది......నాకు పందొమ్మిది సంవత్సరాలూ ఈమధ్యనే వెళ్ళినాయి. బావకు ఇరవైఒకటోయేడు గడుస్తోంది—.

నా మేనత్తకొడుకు కేశవం చిన్ననాటనే తల్లిని కోల్పోయేడు. అప్పటినుంచీ మా యింట్లోనే పెరిగేడు. అతనితండ్రి రెండో పెళ్ళి చేసుకుని ఎక్కడో సంసారం చేసుకుంటున్నాడు. అయనకీ కేశవానికీ సంబంధం తీరిపోయినట్లే కనబడుతుంది. అందుచేత అన్ని విధాలా బావకి మా నాన్నే దిక్కయ్యేడు.

మేమిద్దరమూ చిన్నప్పటినుంచీ ఒకేకంచంలో తినీ ఒకే మంచంమీద పడుకునీ పెరిగేం. ఒక్కరోజుకూడా ఒకర్నివిడిచి ఒకరం వుండలేదు. అటువంటప్పుడు మా యిద్దరికీ ఒకరిమీద ఒకరికి అభిమానమూ, దానిమీద అనురాగమూ పుట్టుకురావడంలో ఆశ్చర్యంలేదు.

అప్పటికి నాకు పదిహేనేళ్ళు. సంబంధాలువచ్చి పడిపోతున్నాయి.

నేను బావనే బాగా ప్రేమించేననీ, నన్ను ఇంకొకరికి పెళ్ళిచెయ్యడం న్యాయంకాదనీ మా నాన్నకి తెలుసు. కాని అంత చిన్నవాడికి నా అంత పెద్దదాన్నిచ్చి ఎలాగ పెళ్ళిచేస్తారు? ఏసంబంధం వచ్చినా పనికిరాదంటున్నాను.—నామాట తోసెయ్యడానికి చిన్నపిల్లనీ చితకపిల్లనీకాదు—బాగా జ్ఞానంవచ్చిన దాన్ని మరి!...అప్పటికప్పుడే మా అమ్మ కోపం మితిమీరిపోతోంది—వివాహం విషయం నా యిష్టంమీదనే ఆధారపడివుండడం మూలాన్ని బావకి నన్నిచ్చి పెళ్ళిచెయ్యక తప్పిందిగాదు.

* * *

మా అక్కయ్య పిల్లలతో ఒకసారివచ్చి వెళ్ళింది. అది మొదలు మా అమ్మ సాధింపులకి. మా అక్కయ్య మొగుడుకూడా నిరుద్యోగంలోనే పనిచేస్తున్నాడు. అయినా వారికి కొంత ఆస్తి వుంది కాబట్టి ఇంత తింటున్నారు. మరి మాకు నిజానికి ఏమీ లేవుకా—. మా నాన్న చదివిస్తేనే ఏదేనా వుంది. అందులోనూ బావ ఈ సంవత్సరం చదువు మానివేసేడుకదా—మా అమ్మ ఈ లోకువ దొరకపుచ్చుకుంది.

సణుగుడల్లాపోయి తిట్లలోకీ—ఉపన్యాసాలలోకీ మారిపోయింది. కొందరి ఆడవాళ్ళలో వున్న ఈ గుణానికి నాకే ఆశ్చర్యం అసహ్యమూ వస్తుంది. ఏమీ తగినంత కారణంకూడా వుండక్కర్లేదు. అదేమిటోగాని!

ఇంకెందుకూ—స్పష్టంగా చెపుతాను. ఆ యింట్లో జీవితమంటే నాకే రోత జనించింది. నా తల్లి అంటే నాకే అసహ్యం వేసింది. బావ పాపం తలవంచుగుని ఒక్క మాటేనా అనేవాడు కాదు. బావని చూస్తే నాకు జాలివేసేది. అతని జీవితాన్ని పాడుచేసినదాన్ని నేనేమోనని ఒకొక్కసారి భయపడేదాన్ని.

అతని జీవితం ఎలాగైనా సుఖవంతం చెయ్యాలని ఒకరోజున నిశ్చయించుకున్నాను.

ఒకరోజున అమ్మకీ నాకూ వాగ్యుద్ధం జరిగింది. అమ్మని గట్టిగా ఎదిరించేను. అనవలసిన నాల్గు మాటలూ అనేశాను.

'ఎల్లకాలమూ మిమ్మల్ని మేపగలమా తల్లీ? నీమొగుడూ నువ్వూ తీరుబడిగా కూర్చునితింటారు—చాకిరీకి నేనూ, సంపాదనకి ఆయనా ఉన్నారు కాదూ!' అంటూ సాగదీసుకుంది.

ఆ మాటలు నాకు సూదుల్లా గుచ్చుకున్నాయి. 'ఇక్కడ ఈ దిక్కుమాలిన కూడు తినేకంటె బికిర మెత్తుగుని బతిగితే మేలు—నీకూ నాకూ తీరిపోయింది. ఇంకొక్క క్షణం నీ యింట్లో వుండను' అంటూ మేడమీదకు వెళ్లిపోయేను.

మా సామాన్లు స్పష్టంగా మూటగట్టేను. నిజానికి అందులో ఒక్క పూచీపుల్లకూడా మాదికాదు. అరగంటలో సిద్ధపడిపోయేను. నాన్న నన్ను సమీపించేడు. నా కళ్ళల్లోవున్న దృఢనిశ్చయం పరికించేడు. ఏమీ అనలేకపోయేడు. నన్ను రహస్యంగా పిలిచి నూరురూపాయల నోటు నా చేతిలో పెట్టేడు. 'ఏదేనా అవసరమయితే వుత్తరం వ్రాయి తల్లీ' అన్నాడు.

ఇంతట్లోనూ బావ వచ్చేడు. సంగతులు విని ఆశ్చర్యపోయేడు. బండీ తీసుగురమ్మని—లోనికివెళ్లి కాళ్ళకి పసుపురాసుగున్నా, బొట్టుపెట్టుగున్నా. అమ్మకాళ్ళకి నమస్కరించబోయేను—నన్నుచూసి అమ్మ నిశ్చేష్టురాలయి నిల్చుండిపోయింది.

అమ్మతోటి వెడుతున్నానని చెప్పేను. అమ్మ ఏమీ మాట్లాడలేదు. నాన్న కళ్ళనీళ్ళతో సమాధానం చెప్పేడు. బండీలో కూర్చునేసరికి—అదేమిటో అంతవరకూ అంత ధైర్యంగావున్న నాకు ఒక్కసారి కళ్ల నీళ్లు తిరిగేయి.

నేపుట్టి పెరిగిన యిల్లు—బావతో ఆడుకుని సరదాగా తిరిగిన యిల్లు—ఇంతవరకూ నీడనిచ్చిన యిల్లు దూరమయిపోతూంటే—నాకు దుఃఖం పొంగిపొంగి వచ్చింది—

'రాధా! ఎక్కడికి వెడదాం?' అన్నాడు బావ.

'ఏలూరు. ఆవూళ్లో నా స్నేహితులు కొందరున్నారు.'

* * *

పవరుపేటలో ఒక చిన్నవాటా అద్దెకు తీసుగుని మా సంసారం ప్రారంభించేము. ముందు చెయ్యవలసిన విషయాన్నిగురించి రాత్రింపగల్లు ఆలోచిస్తూ వుండేవాళ్లం.

బావ పగలస్తమానం ఉద్యోగాన్వేషణలో తిరిగేవాడు. కనపడిన ఖాళీలకల్లా దరఖాస్తులు పంపేవాడు. ఉద్యోగంకోసం పడవలసిన బాధలు ఇప్పుడిప్పుడు మాకు తెలియసాగేయి.

మొదటి రెండు నెలలూ మాకు నిర్విచారంగా గడిచేయి. మాకు ముందుగతి ఏమీ తేలలేదు. ఎక్కడా బావకి ఉద్యోగం దొరకలేదు. దొరికే సూచనలుకూడా లేవు. నలుగురికి ప్రైవేటు చెప్పగుని బతుకుదామన్నా వాటికీ గిరాకీగానే వున్నది. అయితే మా గతేం కాను? నాదగ్గరున్న వస్తువులన్నీ అమ్మినప్పటికీ ఒక సంవత్సరం, సంవత్సరన్నరకంటే ఎక్కువ బతకలేం—అదేనా అతి కష్టంమీద.

# మా ప్రణయ సంసారం

నేను చదువుకున్నదాన్నవడంచేత సులువుగా చాలామంది స్త్రీలతో పరిచయం చేసుకున్నాను. అప్పుడప్పుడు ఒకరిద్దరి ఇండ్లకికూడా వెడుతూవుండేదాన్ని. ఒక స్నేహితురాలు, రమణమ్మ—ఒకరోజున, ఏదో సందర్భాన్ని—'నిన్నను మునసబుగారి పెళ్లాం తన కూతురికి సంగీతం చెప్పిస్తానంది. ఈమధ్యని మన ఆడవాళ్లల్లో సంగీతం పిచ్చి బాగానే బయలుదేరింది సుమ్మా' అంది.

'అయితే ఏం చెప్పిస్తుంది—ఫిడేలా? వీణా?'

'వీణే కాబోలు!'

*   *   *

నాలుగుమాసాలు తిరిగేసరికి నాకు పాతికరూపాయల గ్రాసం ఏర్పడ్డది. ఈలోపున బంగారం అమ్ముకునే మేం జీవిస్తున్నాం గుట్టుగా.

నేను సంగీతానికి వప్పుగున్న ఇళ్లు పెద్దపెద్ద ఉద్యోగస్తులవి. ఆవూరి మహిళాసమాజంలో నాకు మంచి పలుకుబడి వచ్చింది. పెద్దపెద్దవారంతా స్నేహితులయ్యేరు. అన్నీ బాగానేవున్నాయి, కాని బావకి వుద్యోగం దొరికే సాధనంమాత్రం నాకు స్ఫురించేదికాదు!

మాకు ఈపాటి ఆదాయం వస్తూవుంటే మా జీవనం నిర్విచారంగా వెడుతుంది. కాని నేను బాగా కష్టపడవలసివస్తుంది. నా భర్త సుఖంకోసమనీ, నా సుఖంకోసమనీ—కష్టపడడం నాకూ సంతోషమే!

ఇంతలోనూ ఒక వింతమబ్బు మా సంసారాన్ని ముంచుకుపోయింది.

తెల్లవారేసరికి లేచి గృహకృత్యాలు నిర్వర్తించుగుని ఏడూ ఎనిమిదిగంటలయ్యేసరికి బయలుదేరే దాన్ని. ఇద్దరికి పాఠాలుచెప్పి తిరిగి వచ్చేసరికి పదకొండుగంటలయ్యేది. అప్పుడిద్దరమూ భోజనంచేసేవాళ్లం. రెండూ రెండున్నరకి మళ్లీ బయలుదేరి మిగిలిన మూడుచోట్లా పాఠాలుచెప్పి వచ్చేసరికి చీకటిపడేది. ఒక్కొక్కరోజున బాగా రాత్రికూడా అయ్యేది.

*   *   *

'రాధా! నేతింటూ కూర్చోడం—నువ్వు అన్నివిధాలా అలసిపోతూ వుండడం...' అన్నాడు. ఆరోజున నేను చాలా ఆలస్యంగా వచ్చేను. పాయ్యి రాజక నానాఅవస్థ పడుతున్నాను.

ఏంసమాధానం చెప్పాలో నాకు తోచలేదు. అలాగ అనవద్దని దీనంగా చూసేను. నేచెప్పవలసిన విషయం నా కళ్లే బావతో చెప్పేయి.

'నిన్ను కష్టపెట్టే నిర్భాగ్యుణ్నయిపోయేను రాధా!'

అతనికళ్లలోని నీళ్లు నా హృదయాన్ని కలచివేసేయి. బావహృదయం కష్టపడడం నేను చూడలేను. 'నేనేమీ కష్టపడడంలేదు. ఒకవేళ నేమానినా, ఈ కష్టం నువ్వుపడవలసిందే కద? ఇది కష్టంకాదు నాయిష్టం!'

*   *   *

ఆనాటితో తెలిసింది. బావనిజంగా సుఖపడడంలేదనీ, మనస్సులో చాలా బాధపడుతున్నాడనీ, నాసంపాదన మొదలెట్టినదగ్గర్నుంచీ అతనిలోకలిగిన మార్పుని ఆనాడు గ్రహించగలిగేను.

నిజమే సంపాదించి ఇంకొకర్ని పోషించవలసినవాడు...తనే ఇంకొకరిచేత పోషింపబడేటప్పుడు—అందులో తనభార్యచేత పోషింపబడేటప్పుడు? ఎంతతగ్గిపోతాడో, అది వూహాతీతం!

బావచేసిన ప్రయత్నాలన్నీ వృథాలయ్యేయి. ఆఖరికి కోమటి గుమస్తాగిరియేనా దొరకలేదు. ఇంకప్రయత్నమంటేనే అతనికి విసుగువచ్చింది. రాత్రింబగళ్లు ఇల్లుకదిలేవాడుకాదు. ఏదో పెద్దజబ్బుచేసి

తీసుకున్న వాడిమాదిరి మారిపోయేడు. ఎప్పుడూ పడకకుర్చీలో ఆలాగకూర్చుని ఏదో ఆలోచిస్తూవుండేవాడు. మాటవరసకి ఒక్కసారైనా ఈవలకి వచ్చేవాడుకాదు.

బావలో ఈమార్పు నన్ను మరీ మరీ, కలచివేసింది.

* * *

ఆరోజున మాక్లబ్బు వార్షికోత్సవం. నేను చాలా పెంద్రాళేనే వెళ్లవలసివచ్చింది. తిరిగి వచ్చే టప్పటికి రాత్రి తొమ్మిదిగంటలయింది. బావని రమ్మని ఎంతేనా ప్రార్థించుకున్నాను. కాని—!

వీధితలుపు జేర్లానే వేసివుంది. లోనప్రవేసించేసరికి బావ పడకకుర్చీలో పడుకొనివున్నాడు. చాలా ఆలస్యమయిందని అనుకుంటూ వంటయింట్లోకివెళ్లేను. ఆశ్చర్యం—వంటతయారయి సిద్ధంగావుంది. నా శరీరంమీద వెయ్యితేళ్లు పాకినట్లయింది. నెమ్మదిగా బావదగ్గిరకి వెళ్లేను.

'అన్నం—?' నాలో అదొకవిధమైన బాధ బయలుదేరింది.

'అవును! నువ్వురావడం ఆలస్యమవుతుందికదా అని—నేనే వండేను!' అన్నాడు చిరునవ్వుతో.

నాకంఠం కీచుబోయింది. 'ఆలస్యమయితే మాత్రం?...ఇదేమిటి?—అన్యాయంకాదూ? నేవుండగా నేనా?' నాకు దుఃఖమొస్తోంది.

'ఇంతట్లో ఏం మునిగిపోయింది రాధా? నేవండితే ఏంతప్పు? ఇంతరాత్రి అయినతర్వాత నువ్వు చేతులు కాల్చుకోనడంమాత్రం బాగుందా?'

నాముఖం జేవురించింది...'నా కదంతా పనికిరాదు. ఇక్కడ్నించి—పోనీ—ఎక్కడికీ కదల్నులే. నువ్వుమాత్రం గిన్నెలు ముట్టుగునీయందుకు వీల్లేదు.' నా దుఃఖం ఆపుకున్నాను. 'ఎంత రాత్రయ్యేది—ఏమిటయ్యేది—నేనే వండుతాను. తెలిసిందా?? నీచేతికి గిన్నెలు రావడమేమిటీ?'

బావముఖం వేరువైపుకు తిప్పుకున్నాడు. అతనిముఖం తీక్ష్ణమయ్యింది...'ఆలాగయితే ఊరికే కూర్చుని తినడం నాకిష్టంలేదు సుమ్మా—' అన్నాడు.

బావమాటలు వింటోంటే నాకుదుఃఖం పొంగి పొంగి వచ్చింది. అతనిచేతులుపట్టుకుని ప్రాధేయ పడ్డాను—'బావా! ఆలావాగ్దానంచెయ్యి. నాచేతులో చెయ్యివేసిచెప్పు—' అన్నాను.

'నీకు ఇది ఏమాత్రమూ న్యాయంకాదు రాధా—' అంటూ బావలేచి నిలుచున్నాడు. ఆమాటలు నన్ను శూలాలలాగ బాధింపజొచ్చేయి.........

కొంతసేపటికి మాయిద్దరిముఖాలూ గంభీరతదాల్చేయి. భోజనానికి కూర్చున్నాం. ఒక్క మెతుకేనా ఇద్దరమూకొరకలేదు. ఇద్దరిహృదయాలు కల్లోలంగా వున్నాయి.........

* * *

ఆతరవాత రోజుల్లా ఇద్దరమూ ఆలోచనలతో గడిపేం. ఏ ఆఖాయిత్యమూ జరిగినట్లేలేదు—అన్నీ అప్పుడేమరచిపోయేం. ఆలోచించి ఆలోచించి ఆఖరికి ఒకపద్ధతికి వచ్చేం.

ఇదివరకటి మాసంగతి బాగా ఎరిగున్నది మునసబుగారి భార్య. ఆమెను కలుసుకున్నా. నా వుద్దేశ్యం తెలిపేను. ఆమె మహబాగంది. సంపూర్ణంగా సహాయం చేస్తానంది.

ప్రొద్దున ఏడుగంటలయ్యేసరికి మాయింటికీ ఆరుగురు విద్యార్థినులు వస్తారు. ఈ ఆరుగురే ఆతర్వాత పదిమందయ్యేరు.

ఏడునుంచి ఎనిమిదింటివరకూ వారికి సంగీతం నేర్పుతాను. ఆతర్వాత గృహకృత్యాలలోనికి లీనమౌతాను. అప్పుడు బావ వాళ్లకి ఇంగ్లీషూ, తెలుగూ, లెక్కలూ నేర్పుతాడు. మద్యాహ్నం మళ్లీ రెండుగంటలు నేనూ రెండుగంటలు బావా చదువూ సంగీతమూ నేర్పుతాము.

## మా ప్రణయ సంసారం

ఈవిధంగా మాసంసారంలో ఒకపాఠశాల నడపజొచ్చేము. ఇందువల్ల నేనూ బావా సమంగా తాపత్రయం పడుతున్నాము. ఇంకోసంగతి—పని నాకూ తేలికయింది. విద్యార్థినులకీ లాభదాయకమయింది. ఇదివరకు నాకిచ్చేజీతానికే వారికి చదువూ సంగీతమూకూడా వస్తున్నాయి.

తర్వాత తర్వాత అనేకమంది తమ పిల్లలని పంపుతామనేవారు కాని నేను వప్పుకునేదాన్నికాను. తిన్నగా మనకివచ్చినది చెప్పవలెనంటే పదిమందేఎక్కువ. అంతకంటే ఎక్కువైనప్పుడు చదువుసాగదు. పూర్వం 'నలందా' 'తక్షశిలా' విశ్వవిద్యాలయాలలో పదిమంది విద్యార్థుల కొక్కొక్క ఉపాధ్యాయుడు చొప్పున పదివేలమంది ఉపాధ్యాయులుండేవారట!

మా జీవితంలో ఆదర్శరమణిని ఒక్కతెను తయారు చెయ్యగలిగితేచాలు.

◆ ◆ ◆

మా ప్రణయసంసారకథ అంతమయినట్లే—కాని ఒక్కవింత సంఘట్టన ఆతర్వాత జరిగింది. అదిచెప్పి ముగిస్తాము. ఒకరోజున మేమిద్దరమూ సాయంత్రం కబుర్లుచెప్పుకుంటున్నాం. ఒకవుత్తరం వచ్చింది. యడ్రస్సు మానాన్నదస్తూరీతోవుంది.

ఆవుత్తరంలో వున్న ముఖ్యసంగతులివి— '...మీరిద్దరూ వెళ్ళినతరవాత అమ్మ స్వభావం పూర్తిగా మారిపోయింది....ఇప్పటికి రెండునెలలనుంచి అమ్మ మంచంమీదనుంచి లేవడంలేదు. ఎందుకు అంత అలాగఅయిపోయిందో వూహించుకొనలేకపోయేం—కాని—మొన్నటినుంచి అమ్మస్థితి మరీ అన్యాయంగావుంది. 'అమ్మాయిని పొమ్మన్నాను—అదెంత కష్టపడుతోందో—రాధని ఒక్కసారిపిలవండి. రాధ చేత్తో ఒక్కగుక్కెడేనా నీళ్ళుపోస్తేనేగాని ఈజీవివెళ్ళదు' అంటూ ఆరంభించింది.

మీరు ఏలూరులోవున్నట్లు మేము చూచాయగా తెలుసుగున్నాం—కాని, మీ సరయిన యడ్రస్సు తెలియక—ఈ రెండురోజులూ ఆలస్యమయ్యింది.' ఉత్తరం చదువుతోంటే నాకళ్ళనీళ్ళు తిరిగేయి...

ఇద్దరం వెంటనేలేచి నిలబడ్డాము. నాతల్లి ప్రేమహృదయంలో ఇద్దరంతిరిగి ప్రవేశించగలిగేం. ఆమె ప్రేమమందిరంలో మాప్రణయ సంసారం ఇంక నిశ్చింతగా నడవగలదు—నిశ్చయం!

ఇప్పుడు ఇద్దరమూ అమ్మనిచూడ్డానికి వెడుతున్నాం.—


## జ్వరపీడితులకు నూతన నమ్మకము

ప్రఖ్యాతిగాంచిన ఆహారపానీయపు మూలమున పత్యపు సంశయము తొలగించబడినది.

కేవలము నిశ్శక్తులగుట జ్వరముయొక్క ఫలితము. పోగొట్టుకొన్న శక్తిని తిరిగి సంపాదించ లేమని తలతురు. ఈ అశక్తత ఒక్క బలహీనతవల్లనే కాదనియు, వీనికి విషమే కారణ మనియు డాక్టర్లు చెప్పుదురు.

జ్వరపు విషము రక్తములో కలసి అతివేగముగా నరమాంస కండరములలో ప్రవేశించి వాటిని నీరసముగాజేయును. స్వల్పదినములలో జీర్ణశక్తి తగ్గుటచే ఏ ఘనపదార్థమును తీసుకొనలేరు. సత్తువనిచ్చు ఆహారమును తీసికొనునట్లు రోగిని ప్రోత్సహించిన ఈ జ్వరబాధను చాలవరకు తగ్గించవచ్చును. శక్తి విహీనమైన దేహమునకు, తిరిగి శక్తిని చేకూర్చుటకు కావలసిన సత్తువ నిచ్చు పదార్థము హార్లిక్సునందున్నది. ఇది జీర్ణశక్తికి ఎలాటిహాని కలుగజేయదు. తేర్గడకాలము తగ్గించును. సులభముగా జీర్ణమగును గనుక చాలమట్టుకు అన్ని ఆస్పత్రులయందు జ్వరబాధితులకు ఇచ్చు ఏర్పాటు చేసినారు.

H. 462 A.